## క్లుప్తంగా

### చెత్త కుప్పలకు నిప్పు



యార్డులో మంటలను ఆర్పుతున్న ఫైర్, మున్సిపల్ సిబ్బంది

**రాయదుర్గంటౌన్:** రాయదుర్గం పట్టణంలోని శాంతినగర్‌లోని మున్సిపల్ డంపింగ్‌యార్డులో చెత్త కుప్పలకు మంగళవారం రాత్రి నిప్పంటుకుంది. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అప్పటికప్పుడే ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేసి మంటలను అదుపు చేశారు. బుధవారం ఉదయం మళ్లీ నిప్పంటుకుని భారీ స్థాయిలో నిప్పుతోపాటు పొగ వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో మంటలను అదుపు చేశారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మంటలను అదుపు చేశారు. ఆకతాయిలు ఈ పని చేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప డంపింగ్‌యార్డుకు వెళ్లి పరిస్థితి సమీక్షించారు. అప్రమత్తంగా ఉండి మంటలు మరింత వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పథకాలను వినియోగించుకోండి

**కళ్యాణదుర్గం రూరల్:** కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్‌డీ బాలాజీ తెలియజేశారు. బుధవారం మండల పరిధిలోని మానిరేవు, కొండాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

### విద్యార్థికి అభినందనలు



అనిల్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

**రాయదుర్గం రూరల్:** హిమాచల్ ప్రదేశ్‌లోని హట్‌కోటిలో నేషనల్ అడ్వెంచర్ శిక్షణా శిబిరంలో ప్రతిభ కనబరచి కళాశాలకు తిరిగివచ్చిన కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి అనిల్ కుమార్‌ను స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామామూర్తి, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది బుధవారం అభినందించారు. విద్యార్థి తన అనుభవాలను పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

### టీషర్టుల పంపిణీ

**కళ్యాణదుర్గం రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు బుధవారం రసవత్తంగా సాగుతున్నాయి. జేసీఎస్ పట్టణ కన్వీనర్ అర్చన క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం మండలం, అర్బన్ పరిధిలో అన్ని క్రీడల్లో కలిపి 20 జట్లకు పోటీలు నిర్వహించామని తెలిపారు.

### పేదలకు మెరుగైన వైద్య సేవలు



శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

**రాయదుర్గంటౌన్:** 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా నిరుపేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని భంభంస్వామి లేఅవుట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో 9వ సచివాలయం పరిధిలోని వార్డు ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఓపీ రిజిస్ట్రేషన్, పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ల్యాబ్, మందుల కౌంటర్, కంటి పరీక్షా కేంద్రం, స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో అందుతున్న సేవలను పరిశీలించారు. దాదాపు 466 మందికి వివిధ రకాల వైద్య సేవలను వైద్యులు అందజేశారు. 15 మందిని కంటి వెలుగు కింద ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు కమిషనర్ తెలిపారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేడు పింఛన్ పంపిణీ

**బెళుగుప్ప:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వం పెంచిన రూ.3వేల పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరు కానున్నారు.

### నేడు కంటి వైద్య శిబిరం

**కూడేరు:** మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్‌లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. ఈమేరకు నిర్వాహకుడు రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంటి సమస్యలున్నవారు ఆధార్ కార్డుతో వచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు.

# విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్

● ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి





కూడేరు: వృద్ధులకు పింఛన్‌సొమ్ము అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

**కూడేరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మారుపేరని.. మాటిచ్చాడంటే చేసి తీరుతారని.. నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలను 99.5 శాతం అమలు చేశారని ఉవరకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద పెంచిన రూ.3 వేలు పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ గొప్ప ప్రజాస్వామ్య, మానవతావాది అన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ మొత్తాన్ని రూ.2 వేల నుంచి 3 వేలు చేసి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. మండలంలో 5,763 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.1.70 కోట్ల నగదును పంపిణీ చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి తెల్లవారుజామునే లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందజేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలను వర్తింపజేశారన్నారు. జగనన్న చంద్రబాబులా ఓట్ల కోసం మాయమాటలు చెప్పేరకం కాదన్నారు. టీడీపీ, వైఎస్సార్ పాలనలో తేడా గమనించాలన్నారు. ఆర్థిక భరోసా కల్పిస్తున్న జగనన్నకు పింఛన్‌దారులు మద్దతుగా నిలవాలని కోరారు. జగన్ మేలును మరువమని, ఆయనకు అండగా ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, వైస్ ఎంపీపీలు దేవ, సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యుడు సర్దార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, మండల, జిల్లా నేతలు విజయబాస్కర్ రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, శంకర్ నాయక్, రామాంజనేయులు, క్రిష్టప్ప, చంద్రశేఖర్, సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పండుగలా పింఛన్ల పంపిణీ**

**కళ్యాణదుర్గం రూరల్:** ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పింఛన్లను రూ.3 వేలకు పెంచారని ఎంపీపీ మారుతమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ భాగంగా జనవరి నుంచి రూ.3,000 పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా నూతనంగా 75 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సాలమాన్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, మండల కన్వీనర్ సర్వోత్తం, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, పాల్గొన్నారు.

**కొత్తగా 44 పింఛన్ల మంజూరు..**

**శెట్టూరు:** మండల వ్యాప్తంగా 44 మందికి నూతనంగా వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరు అయినట్లు ఇంచార్జ్ ఎంపీడీఓ రఘురామరావు ప్రకటనలో తెలిపారు. దీనితో మండలలో మెత్తం 5,879 మంది లబ్దిదారుకలు సుమారు రెండు కోట్ల వరకు ప్రతి నెల అందించనున్నట్లు తెలిపారు. క్రొత్తగా మంజూరైన పెన్షన్లు త్వరలోనే లబ్దిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

**కంబదూరుకు 96 పింఛన్లు..**

**కంబదూరు:** మండలానికి కొత్తగా 96 వైఎస్సార్ పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మండల వ్యాప్తంగా 7,648 పింఛన్లు వస్తుండగా.. కొత్తవి 96 కలిపి 7,444 పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మండలానికి రూ.2.23 కోట్ల సొమ్మును ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. పింఛన్ సొమ్మును ఈనెల 8వ తేదీన లబ్దిదారులకు అందజేస్తామన్నారు.



కళ్యాణదుర్గంలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న అధికారులు

### ప్రతి హామీ అమలు

● ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



వజ్రకరూరు మండలం కొనకొండ్లలో పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**వజ్రకరూరు:** ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొనకొండ్ల గ్రామంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ పింఛన్‌దారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో 66 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1న లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ సొమ్ము అందజేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ల మంజూరు కోసం జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడటంతో మరోమారు ప్రజలను వంచించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలతో వస్తున్నాడన్నారు. అనంతరం 34 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీడీఓ విజయ లలిత, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర, మాజీ ఉపసర్పంచు గురు, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### పేదల తలరాత మార్చిన సీఎం జగన్

**రాయదుర్గంటౌన్:** పేదల తలరాత మార్చి సంక్షేమ పథకాలతో వారి జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్పు తెచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అక్కాచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్ అందజేసి విశ్వసనీయతకు మారుపేరుగా జగనన్న నిలిచినట్లు చెప్పారు. బుధవారం చైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో కౌన్సిలర్లతో కలిసి కాకినాడలో సీఎం వైఎస్ జగన్ పెంచిన పెన్షన్లను పంపిణీ చేసిన కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్లను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదమ్మ, పద్మజ, పట్టణ కన్వీనర్ అరవాశివప్ప, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### గంపగుత్తగా దరఖాస్తులిస్తే కేసులు



మాట్లాడుతున్న ఈఆర్ఓ కరుణకుమారి

**రాయదుర్గం రూరల్:** కొత్త ఓటర్ల నమోదుతో పాటు మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులకు గంపగుత్తగా దరఖాస్తులు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించాలని ఈఆర్ఓ కరుణకుమారి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె 5 మండలాల అధికారులతో పాటు అఖిలపక్ష పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు అన్ని పార్టీల నాయకులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలన్నారు. కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే వారు ఈ నెల 12 లోగా దరఖాస్తులు చేసుకునేలా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, రాయదుర్గం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్ తహసీల్దార్లు ఓబులేసు, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, డి.హీరేహాళ్ డీటీ బసవకుమార్, ఆర్ఐ రామాంజనేయులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**బొమ్మనహాళ్:** వేదావతి హగరి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం ఎస్ఐ ఆంజనేయులు పట్టుకున్నారు. ఆయన తెలిపిన మేరకు.. మండల పరిధిలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు గ్రామ సమీపంలోని వేదావతి హగరి నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### గ్రామాభివృద్ధి కోసమే ప్రణాళిక

**కణేకల్లు:** గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వైకేపీ సీసీ ఎర్రిస్వామి పేర్కొన్నారు. మండలంలోని జక్కలవడికి గ్రామంలో బుధవారం సర్పంచు శారద అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. సీసీ మాట్లాడుతూ డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సమస్య, వీధిదీపాలు తదితర సమస్యలేవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో మౌలిక వసతులన్నీ కల్పించి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్వేత, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంత జీవనం గడపాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

**బొమ్మనహాళ్:** గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని బొల్లనగుడ్డం, కల్లుహోళ గ్రామాల్లో ఆయన పర్యటించారు. రౌడీయిజం, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బస్సుయాత్ర జయప్రదం చేయండి



బస్సుయాత్ర నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ:** ఈనెల 7న పట్టణంలో వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బస్సుయాత్ర నిర్వహణపై పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. బస్సుయాత్ర నిర్వహణ, జన సమీకరణ, రూట్‌మ్యాప్, భోజన ఏర్పాట్లు తదితర అంశాల చర్చించారు. ఈసందర్భంగా సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలంలో పార్టీ ప్రజాప్రతినిధులు బస్సుయాత్రకు తరలివచ్చేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలో సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. యాత్రకు ప్రతి మండలం నుంచి భారీ సంఖ్యలో జనం వచ్చేలా చూడాలన్నారు. బస్సుయాత్రకు తరలివచ్చే వారికి వాహనాలు, భోజన ఎర్పాట్లు ఎక్కడా లోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సుయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వాటిని గ్రామాల్లో విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఉప సర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, పట్టణ నాయకులు ఈడిగ ప్రసాద్, టౌన్‌బ్యాంకు మాజీ అధ్యక్షుడు సాధుకుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

## కంది పంటకోత ప్రయోగాలు

**రాయదుర్గం రూరల్:** మండలంలోని గ్రామదట్ల గ్రామంలో బుధవారం సర్వే నంబర్ 117లోని రైతు గంగాధర పొలంలో కందిపంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఏడీఏ లక్ష్మానాయక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట దిగుబడి పూర్తిగా తగ్గిందని తెలిపారు. మండలంలోని జుంజురాంపల్లి, ఆవులదట్ల, డి.కొండాపురం, బొందనకల్లు, మల్లాపురం, బీఎన్‌హళ్లి, గ్రామదట్ల, 74 ఉడేగోళం గ్రామాలు కంది పంటకోతకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేంద్ర, ఆర్బీకే అసిస్టెంట్ విష్ణుప్రియ, ఎస్‌బీఐ జనరల్ ఇన్సురెన్స్ ప్రతినిధి వన్నూరుస్వామి, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి





పొలికిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జేవీవీ నాయకులు

**విడపనకల్లు:** పొలికి గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్లో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సావిత్రిబాయి పూలే అట్టడుగు వర్గాల ప్రజల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని జేవీవీ నాయకుడు గంగరాజు అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, నాయకులు సుధాకుమారి, లక్ష్మీప్రసాదు, కృష్ణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

**వజ్రకరూరు:** స్థానిక ప్రాథమిక పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం రంగప్రసాద్ అధ్యక్షతన సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున సావిత్రిబాయిపూలే సేవలను కొనియాడారు. రిటైర్డు ఎంపీహెచ్ఈఓ ఖాజాపీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వీట్ల దుకాణాల్లో మోసం



భవానీ డ్రైఫ్రూట్స్, చాక్లెట్స్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

**అనంతపురం క్రైం:** నగరంలోని స్వీట్స్ దుకాణాల్లో మోసం జరుగుతోందని విజిలెన్స్ అండ్ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. బుధవారం భవానీ ఫుడ్స్, భవానీ డ్రైఫ్రూట్స్, చాక్లెట్స్, షిరిడీసాయి స్వీట్‌హౌస్‌లతో పాటు అజ్వాస్ రిటైల్ స్టోర్స్‌లను తనిఖీ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు పేర్కొన్నారు. తనిఖీల్లో తయారీదారుడిపేరు, ఎప్పుడు తయారు చేశారు? తేదీ వివరాలు లేవన్నారు. చాలా ప్యాకింగ్‌లపై ఎంఆర్‌పీ ముద్రించడం లేదన్నారు. ఎంఆర్‌పీ స్థానంలో దుకాణాల యజమానులు తయారు చేయించిన స్టిక్కర్లను అతికించారని పేర్కొన్నారు. లీగల్ మెట్రాలజీ యాక్ట్ 2009 కింద చట్ట ప్రకారం కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇలాంటి తినుబండారాలను అమ్మవద్దని హెచ్చరికలు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులకు జరిమానా విధించారు.

## తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

**ఉరవకొండ:** ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సి.వెంకటనారాయణమ్మ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని బీఎల్ఓలు, తహసీల్దార్‌లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ గతేడాది డిసెంబర్ 26లోగా ఓటరు తుది జాబితా సిద్ధం చేయాలని ఆదేశించిందన్నారు. అయితే జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇంకా సవరణలు జరగాల్సి ఉన్న పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ జనవరి 12లోగా ఎలాంటి పరిస్థితుల్లోను పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో డబుల్ ఎంట్రీలు 1600 గుర్తించామని, వాటిని తొలగించాలన్నారు. దీంతో పాటు జీరో డోర్ నంబరుతో ఒక్క ఓటు ఉండరాదని, డోర్ నంబరు తప్పక ఉండేలా బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఉరవకొండ తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి కార్మికుల ఆందోళన



**కణేకల్లు:** పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు బుధవారం కణేకల్లు మండలం ఆలూరు గ్రామంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేశారు. పంప్‌హౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలివ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించాల్సిన అధికారులు సైతం పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మిరప రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త యుగంధర్

**బెళుగుప్ప:** ఉద్యానవన పంటలు రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం బెళుగుప్ప, గంగవరం, శీర్పి, దుద్దేకుంట గ్రామాల రైతులకు సమగ్ర యాజమన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా అరటి, ఎండు మిరపను రైతులు సాగు చేస్తున్నారన్నారు. పంటలకు తెగుళ్లు ఆశించకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన రైతులకు ఎన్నో రాయితీలు కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళ్యాణదుర్గం ఉద్యానవన అధికారి కృష్ణతేజ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలి



బెళుగుప్పలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసగుప్తా

**బెళుగుప్ప:** జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా జనవరి 2 నుంచి జిల్లా వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభమైందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎన్.శ్రీనివాసగుప్తా సూచించారు. బుధవారం బెళుగుప్ప, శీర్పి, గంగవరం గ్రామాల్లో టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెళుగుప్పలో 276 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించామన్నారు. వ్యాధి నివారణ టీకాలు ఇప్పించడం ద్వారా పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుదలను నివారించవచ్చన్నారు.

**పశువులకు టీకాలు తప్పనిసరి**

**శెట్టూరు:** పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సాయి సుమంత్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బసంపల్లిలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో టీకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

### డీఎస్పీకి ఫిర్యాదు

**కళ్యాణదుర్గం రూరల్:** బ్రహ్మసముద్రం మండలం బైర సముద్రం గ్రామంలోని దళితులపై అదే గ్రామానికి చెందిన గురుస్వామి వారి కుటుంబ సభ్యులు దాడి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో కేసు పెట్టి మూడు రోజులు కావస్తున్న పోలీసులు స్పందంచలేదని బుధవారం డీఎస్పీ శ్రీనివాసులుకు దళిత నాయకులు తెలిపారు. స్పందించిన డీఎస్పీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప, దొన తిమ్మప్ప పాల్గొన్నారు.

### మట్కా నిర్వాహకుడి అరెస్ట్

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యల్లనూరు మండలం వాసాపురం గ్రామానికి చెందిన శివనాయుడు మట్కా నిర్వహిస్తున్నాడు. ఇటీవల అనంతపురం రూరల్ మండలం పాపంపేట శివారులోని స్టేట్ బ్యాంక్ కాలనీలోని అద్దె ఇల్లు తీసుకుని ఇక్కడకి మకాం మార్చాడు. మట్కా రాస్తున్నాడనే సమాచారంతో సీఐ రామకృష్ణారెడ్డి, సిబ్బంది దాడి చేశారు. శివనాయుడుని అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో 120 కర్ణాటక టెట్రా పాకెట్లు, రూ. 2 వేలు విలువైన మట్కా పట్టీలు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు.